BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శనివారం 11 అక్టోబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4

## వేములవాడలో లడ్డూకు బూజు.. భక్తుల ఆందోళన

- **నివేదిక అందజేయాలని మంత్రి కొండా సురేఖ ఆదేశం**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో నాణ్యత లేని లడ్డూలను విక్రయించారని భక్తులు ఆందోళన వ్యక్తం చేశారు. లడ్డూలకు బూజు పట్టినట్లు భక్తులు గుర్తించి, ఆలయంలో పవిత్రంగా భావించే ప్రసాదం ఇలా విక్రయించడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. భక్తులు, లడ్డూలు ఉంచిన ట్రేల నుంచి దుర్వాసన వస్తున్నట్లు, ఎంతో పవిత్రంగా భావించే లడ్డూ ప్రసాదానికి ఇలాంటి పరిస్థితులు కలగడం తగదు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఈ ఘటనపై స్పందిస్తూ, సంబంధిత అధికారుల నుంచి పూర్తి వివరాలు సేకరించామని, సమగ్ర నివేదిక అందజేయాలని ఆదేశించారు. "దేవాలయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలి. ఆలయ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం" అని మంత్రి హెచ్చరించారు. లడ్డూ ప్రసాదంపై భక్తుల నుంచి విమర్శలు రావడంతో ఆహార భద్రతా అధికారులకు లేఖ రాసినట్లు ఆలయ ఈవో రమాదేవి తెలిపారు. ఆలయ పవిత్రతను కాపాడుతామని, భక్తుల మనోభావాలను గౌరవిస్తామని, అందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

### రూ. 1100 కోట్ల
# విలువైన భూమిని కాపాడిన హైడ్రా



- **దాదాపు 12.50 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం**
- **దాదాపు రూ. 1100 కోట్ల**

**విలువైన భూమిని కాపాడిన హైడ్రా**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

నగరంలో పలు చోట్ల ఆక్రమణలను శుక్రవారం హైడ్రా తొలగించింది. ఒకేసారి నాలుగు ప్రాంతాల్లో కబ్జాల నుంచి ప్రభుత్వ భూమికి విముక్తి కల్పించింది. 12.50 ఎకరాల మేర ప్రభుత్వ భూమిని కాపాడింది. దీని విలువ రూ. 1100ల కోట్ల వరకూ ఉంటుందని అంచనా. బంజారా హిల్స్ రోడ్డు నంబరు 10లో మొత్తం 5 ఎకరాల మేర ఉన్న కబ్జాలనుతొలగించింది. ఇక్కడ ఈ భూమి విలువ రూ. 750 కోట్ల వరకూ ఉంటుందని భావిస్తున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 7.50 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోగా..రంగారెడ్డిజిల్లాలో ప్రజావసరాలకు ఉద్దేశించిన 680 గజాల స్థలాన్ని హైడ్రా శుక్రవారం కాపాడింది.

**తప్పుడు సర్వే నంబరుతో..**

షేక్‌పేట మండలం, బంజారాహిల్స్ రోడ్డు నంబరు 10లోని సర్వే నంబరు 403లోని 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జాల చెర నుంచి హైడ్రా విడిపించింది. దీని విలువ రూ. 750 కోట్ల వరకూ ఉంటుందని అంచనా. లేని సర్వే నంబరు(403/52 )తో.. అన్ రిజిస్టర్డ్ సేల్‌డీడ్‌ను సృష్టించి ఈ భూమి తనదంటూ పార్థసారథి అనే వ్యక్తి కబ్జాకు పాల్పడినట్టు రెవెన్యూ అధికారులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. తాగు నీటి వ్యవస్థను మెరుగు పరిచేందుకు ఇందులో 1.20 ఎకరాల భూమిని జలమండలికి ప్రభుత్వం ఇచ్చినా అక్కడ పనులు చేయకుండా అడ్డుకుంటున్నారనేది మరో ఫిర్యాదు. ఈ రెండు ఫిర్యాదులను హైడ్రా క్షేత్రస్థాయిలో పరిశీలించి.. ప్రభుత్వ భూమిగా నిర్ధారించుకుని ఆక్రమణలను శుక్రవారం తొలగించింది.

**వేట కుక్కలతో కాపలా..**

చుట్టూ ఫెన్సింగ్ వేసి బౌన్సర్లతో పాటు వేటకుక్కలతో కాపాలా పెట్టి అందరినీ భయభ్రాంతులకు గురిచేస్తుండడంతో పార్థసారథిపై బంజారా హిల్స్ పోలీసు స్టేషన్లో 4 క్రిమినల్ కేసులు కూడా నమోదయ్యాయి. కోర్టులో వివాదం ఉండగా.. మొత్తం 5 ఎకరాల భూమిని తన ఆధీనంలోకి తీసుకొని అందులో షెడ్డు లు వేసి.. ప్రభుత్వ భూమినే అడ్డా వేసుకొని మద్యం సేవించి భయభ్రాంతులకు గురి చేస్తున్నట్టు ఫిర్యాదులున్నాయి. ఫేక్ సర్వే నంబర్ (403/52) తో ప్రభుత్వ భూమి కొట్టేసే ప్రయత్నం చేస్తున్నారని రెవెన్యూ అధికారులు కేసులు పెట్టారు. షేక్పేట రెవెన్యూ అధికారుల లేఖ మేరకు భారీ బందోబస్తు మధ్య ఆక్రమణలను హైడ్రా తొలగించింది. పార్థసారథి వేసిన ఫెన్సింగ్ తో పాటు లోపల ఉన్న షెడ్డులను నేలమట్టం చేసింది. 5 ఎకరాల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులను హైడ్రా ఏర్పాటు చేసింది.

**మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలోనూ..**

కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం మహాదేవ పురం లో పార్కులు, ప్రజావసరాల కు ఉద్దేశించిన స్థలాలు కబ్జాలకు గురి అవుతున్నట్టు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా క్షేత్రస్థాయిలో విచారించి శుక్రవారంచర్యలు తీసుకుంది. 3.50 ఎకరాల మేర పార్కు స్థలంలో ఆక్రమణలను తొలగించింది. మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ విలేజ్ ఏజీ ఆఫీసు ఉద్యోగులకు చెందిన హౌసింగ్ సొసైటీ లే ఔట్‌లో కూడా పార్కులు, రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన 3 ఎకరాల ల్యాండ్ కబ్జాకు గురి కాగా హైడ్రా శుక్రవారం ఆక్రమణలను తొలగించింది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం తట్టి అన్నారం విలేజ్ శ్రీలక్ష్మి గణపతి కాలనీలో కూడా 680 గజాల మేర విస్తరించిన పార్కు ఆక్రమణలను కూడా హైడ్రా తొలగించింది. ఇందులో 270 గజాల ప్లాట్ తనకుందంటూ పార్కు స్థలంలోనే పాగా వేసేందుకు ప్రయత్నించగా స్థానికులు హైడ్రాను ఆశ్రయించారు. క్షేత్రస్థాయిలో విచారించిన దరిమిలా పార్కు స్థలాన్ని మొత్తం కాపాడి ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది.

# ముగ్గురు మావోయిస్టు కీలక నేతల లొంగుబాటు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్ర పోలీసు డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట ముగ్గురు సీనియర్ మావోయిస్టు నేతలు శుక్రవారం అధికారికంగా లొంగిపోయారు. సిద్దిపేట జిల్లా వాసి కుంకటి వెంకటయ్య అలియాస్ రమేశ్, మొగిలిచర్ల చందు అలియాస్ వెంకట్రాజు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన తోడెం గంగ అలియాస్ సోనీ లొంగిన వారిలో ఉన్నారు.

డీజీపీ మాట్లాడుతూ ఈ ముగ్గురు నేతలు దక్షిణ బస్తర్ దళంలో ముఖ్య భూమిక వహించారని తెలిపారు. ప్రజా స్రవంతిలో కలవాలన్న పోలీసు శాఖ పిలుపు మేరకు లొంగిపోయారని చెప్పారు. మొగిలిచర్ల చందు మావోయిస్టు స్టేట్ కమిటీ సభ్యుడిగా, ధర్మసాగరం మండల వాసిగా, దండకారణ్య జోన్‌లో సెక్రటరీ హోదాలో పనిచేశారని వివరించారు.

ఇటీవల కాలంలో మావోయిస్టు నాయకత్వంలో విభేదాలు ఉద్భవించాయని డీజీపీ వెల్లడించారు. ఆయుధాల అప్పగింతపై ప్రచురితమైన లేఖ కూడా నిజమని భావిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 412 మంది మావోయిస్టులు లొంగిపోగా, వారిలో 72 మంది తెలంగాణకు చెందినవారని వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఉన్న 12 కేంద్ర కమిటీ సభ్యుల్లో 10 మంది తెలంగాణ వాసులే ఉన్నారని చెప్పారు.

**లొంగిన వారికి ప్రభుత్వ ప్రోత్సాహకాలు**

మావోయిస్టు నేతలు అజ్ఞాతం వీడి ప్రజల జీవితాల్లో కలవడం అభినందనీయమని డీజీపీ పేర్కొన్నారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం, పునరావాసం, జీవనోపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఇటీవల కాలంలో 403 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు కూడా వెల్లడించారు.

# బీసీ రిజర్వేషన్లపై రేవంత్ డ్రామాలు ఆడుతున్నారు

- **బీజేపీ ఎంపీ డా.లక్ష్మణ్**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ అసలు ముఖం బయటపడిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డ్రామాలు ఆడుతున్నారని బీజేపీ రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా. కె.లక్ష్మణ్ తీవ్రంగా విమర్శించారు. ట్రిపుల్ టెస్ట్ అంశంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, బీసీలకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు లేదని ఆరోపించారు. బీహార్ ఎన్నికల్లో రాజకీయ లాభం కోసం రాహుల్ గాంధీ ఒత్తిడికి లొంగి, రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్ల పేరుతో ప్రజలను మభ్యపెట్టే నాటకం ఆడారని డా.లక్ష్మణ్ అన్నారు. రిజర్వేషన్ల అంశం న్యాయ సమీక్షకు వెళ్తుందని ముందే తెలుసు కాబట్టి కనీస జాగ్రత్తలు తీసుకోవాల్సిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని మండిపడ్డారు.

కాంగ్రెస్ పార్టీ ఆర్డినెన్స్‌లు, జీవోల పేరుతో కాలయాపన చేస్తూ, కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేసిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో బీసీ వర్గాలు మరోసారి వంచించబడ్డాయని పేర్కొన్నారు. బీసీలకు రిజర్వేషన్లు పెంచే ప్రయత్నం చేశామని చెప్పి, కోర్టు తీర్పులను సాకుగా వాడుకుని బీసీల ఓట్లు దండుకోవాలనుకుంది కాంగ్రెస్ పార్టీ అని డా.లక్ష్మణ్ విమర్శించారు. 50 శాతం రిజర్వేషన్ క్యాప్ వంటి అంశాలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు.

## ఇంజినీరింగ్ కాలేజీలో భారీ చోరీ

- **అల్మారా పగలగొట్టి కోటి డెబ్బై లక్షల రూపాయలు అపహరణ**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఇంజినీరింగ్ కాలేజీలో అల్మారా పగలగొట్టి కోటి డెబ్బై లక్షల రూపాయలు దొంగిలించిన ఘటన రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని బ్రిలియంట్ ఇంజినీరింగ్ కాలేజీలో కళాశాల ప్రిన్సిపాల్ ఉలిగడ్ల వీరన్న గురువారం సాయంత్రం ఆరు గంటలకు విధులు ముగించుకొని కాలేజీ గేట్, ఆఫీస్ రూంకు తాళాలు వేసి వెళ్లారు, మరునాడు ఉదయం 8:45 గంటలకు కళాశాల ఏఓ కేశినేని కుమార్ కళాశాలకు వెళ్లగా కాలేజ్ గేట్, రూం, అల్మార తాళాలు పగుల గొట్టి ఉనట్టు ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇచ్చారు. దాంతో ప్రిన్సిపాల్ అక్కడికి చేరుకొని పరిశీలించగా కోటి డెబ్బై లక్షల

## వేగంగా
# రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి

- ఎకరం భూమి రూ.177 కోట్లకు అమ్ముడవడం అభివృద్ధికి నిదర్శనం
- ప్రభుత్వ వేలం నగర అభివృద్ధికి సూచిక
- తాగునీటి, మురుగునీటి ప్రాజెక్టులకు భారీ కేటాయింపులు
- పట్టణాభివృద్ధి ప్రణాళికలో భాగంగా బడ్జెట్‌లో రూ.10,000 కోట్లు కేటాయించగా మురుగు నీటి శుద్ధి ప్లాంట్లు, తాగునీటి అవసరాల కోసం రూ.13,000 కోట్లు ఖర్చు చేస్తున్నాస్త్ర
- 24 గంటల విద్యుత్, మంచినీటి సరఫరా హైదరాబాద్ ప్రత్యేకత
- ఇతర నగరాలతో పోల్చితే హైదరాబాద్‌లో 24 గంటలు నాణ్యమైన విద్యుత్, మంచినీటి సరఫరా
- త్వరలో నగరంలో ఎలక్ట్రిక్ బస్సులే
- రియల్టర్లు సంపద సృష్టికర్తలు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- హైటెక్స్‌లో నరేడ్కో ప్రాపర్టీ షో ప్రారంభం



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన ప్రభుత్వ భూవేలంలో ఎకరం భూమి రూ.177 కోట్లకు అమ్ముడవడం నగర రియల్ ఎస్టేట్ రంగం ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో సూచిస్తోందని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. హైటెక్స్‌లో శుక్రవారం ప్రారంభమైన తెలంగాణ నరేడ్కో ప్రాపర్టీ షోను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, హైదరాబాద్ మహానగరాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని తెలిపారు. ప్రతి సంవత్సరం పట్టణాభివృద్ధి ప్రణాళిక వ్యయంలో భాగంగా బడ్జెట్‌లో రూ.10,000 కోట్లు కేటాయిస్తున్నట్లు వివరించారు.

**మురుగునీటి, తాగునీటి ప్రాజెక్టులకు భారీ కేటాయింపులు**

మురుగునీటి శుద్ధి ప్లాంట్లు, తాగునీటి అవసరాల కోసం దాదాపు రూ.13,000 కోట్లు వెచ్చిస్తున్నామని తెలిపారు. "మరే ఇతర నగరంలో లేని విధంగా హైదరాబాద్‌లో 24 గంటలు నాణ్యమైన విద్యుత్, మంచినీటి సరఫరా జరుగుతోంది" అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. భవిష్యత్తులో నగరంలో ఎలక్ట్రిక్ బస్సులు మాత్రమే నడిచేలా చర్యలు తీసుకుంటున్నామని, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ఎలక్ట్రిక్ వాహనాలకు పన్ను మినహాయింపులు కల్పించినట్లు తెలిపారు. రియల్ ఎస్టేట్ రంగంలో పనిచేస్తున్న రియల్టర్లు, బిల్డర్లను సంపద సృష్టికర్తలుగా ప్రభుత్వం గౌరవిస్తుందని, వారి సమస్యలను పరిష్కరించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు.

# కోటి విలువగల ఓపీయం, పాపిస్ట్రా స్వాధీనం



- **403 మంది డ్రగ్ పెడ్లర్లు, సరఫరాదారులు, విక్రయదారులను అరెస్టు చేశాం**
- **రాచకొండ సీపీ జీ. సుధీర్‌బాబు**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

గుట్టుచప్పుడు కాకుండా రాజస్థాన్ టూ చెన్నైకు హైదరాబాద్ మీదుగా డ్రగ్స్ సప్లై చేస్తున్న ఇద్దరు నిందితుల్లో ఒకరిని మల్కాజ్‌గిరి ఎస్‌వోటీ బృందంతోపాటు కీసర పోలీసులు అరెస్టు చేశారు. నిందితుని నుంచి కోటి రూపాయలు విలువ చేసే 7 కేజీల ఓపీయం, 2 కేజీల పాపిస్ట్రా స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌వోటీ డీసీపీ ఏ.రమణారెడ్డితో కలిసి రాచకొండ సీపీ జీ. సుధీర్‌బాబు వివరాలను వెల్లడించారు. రాష్ట్రాన్ని డ్రగ్ ఫ్రీ తెలంగాణగా చేయాలని ప్రభుత్వం పోలీస్ శాఖకు సూచించిందని, అందులో భాగంగా మాదక ద్రవ్యాల సరఫరా, వినియోగం, విక్రయాలపై ప్రత్యేక నిఘా వేశామన్నారు. ఇప్పటివరకు రాచకొండ కమిషనరేట్‌లో 403 మంది డ్రగ్ పెడ్లర్లు, సరఫరాదారులు, విక్రయదారులను అరెస్టు చేశామని తెలిపారు. అందులో 148 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారున్నారని వివరించారు. ఇతర రాష్ట్రాల్లో ఉండి డ్రగ్ ముఠాలను నడిపించే కొంత మంది నేరస్తులను పట్టుకునేందుకు ఇక్కడి నుంచి ప్రత్యేక బందాలను పంపించి అరెస్టు చేశామని తెలిపారు. ఈ క్రమంలో రాజస్థాన్‌కు చెందిన ఇద్దరి ముఠా నడిపిస్తున్న డ్రగ్ రాకెట్ వెలుగు చూసిందన్నారు. రాజస్థాన్‌కు చెందిన లోకేష్ భరత్ హోటల్ మేనేజ్ మెంట్ చేశాడు. 'ఆ తర్వాత టెక్స్‌టైల్స్‌తోపాటు పిజ్జాహట్ వివిధ ప్రాంతాలల్లో పనిచేశాడు. కొన్నాళ్లపాటు ఉదయ్‌పూర్‌లోని గోల్డెన్ హోటల్‌లో మేనేజర్‌గా పని చేశాడు. అతను పని చేసే హోటల్ మూసివేయడంతో ఉద్యోగం పోయింది. ఈ క్రమంలో సులువుగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. రాజస్థాన్‌కు చెందిన డ్రగ్స్ సప్లయర్ జగదీష్ గుజ్జర్‌తో చేతులు కలిపాడు. ఇద్దరూ కలిసి రాజస్థాన్ నుంచి చెన్నైకు డ్రగ్స్

మిగితా 4వ పేజీలో

# 14న రాష్ట్ర వ్యాప్త బంద్

- **బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఈ నెల 14న రాష్ట్ర వ్యాపిత బంద్‌కు పిలుపునిచ్చినట్లు బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, బిజెపి ఎంపీ ఆర్.కృష్ణయ్య తెలిపారు. రిజర్వేషన్ల అంశంలో బీసీ సంఘాలన్నీ అవమానం మీద తిరుగుబాటులాగా భావించి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చినట్లు చెప్పారు. శుక్రవారం నాడు ఆయన నివాసంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశ చరిత్రలో నోటిఫికేషన్ ఇచ్చిన తరువాత స్టే ఇవ్వడం మొదటి సారి అని ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వేషన్లపై బీసీలు గంపెడాశలు పెట్టుకున్నారని, ఈ సమయంలో ఇలాంటి తీర్పును తాము ఆశించలేదని అన్నారు. %ూశ్రీంశీ క్ష్మఘు౧% – శనివారం రాశి ఫలాలు (11–10–2025) %ూ౧జవతీఅంవవవత్% మరిన్ని కనుగొనండి తెలంగాణ పర్యాటక ప్యాకేజీలు పండుగ షాపింగ్ ఆఫర్లు వ్యాపార వార్తాపత్రిక చందా లైఫ్ స్టైల్ కోర్సులు కెరీర్ కౌన్సెలింగ్ ఎడిటోరియల్ సేవలు ట్రావెల్ ఇన్సూరెన్స్ కొనండి పెట్టుబడి సలహా సేవలు ఆధ్యాత్మిక ఉత్పత్తులు ఈ–పేపర్ చందా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇచ్చాక హైకోర్టు బీసీ రిజర్వేషన్ జీవోపై స్టే ఇవ్వడం దారుణమని అన్నారు. బలమైన ఆధారాలతోనే జీవో నెంబర్ 9ని విడుదల చేశారని, శాస్త్రీయంగా కులగణన ప్రక్రియను ప్రభుత్వం చేపట్టిందని పేర్కొన్నారు. అయినప్పటికీ హైకోర్టు తీర్పుపై ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని అన్నారు. జివో కొట్టివేయడం, ఎన్నికలు నిలిచిపోవడంపై రాష్ట్ర ప్రభుత్వ తీరు పట్ల అనుమానాలున్నాయని అన్నారు. రాష్ట్రాలు రిజర్వేషన్లు పెంచుకోవచ్చని రాజ్యంగంలోని 243/డి6 షెడ్యూల్ స్పష్టంగా ఉందని వివరించారు. అయితే రిజర్వేషన్లు 50 శాతానికి పరిమితం చేయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలు ఎంత ఉన్నారో తమకు అంత రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. వ్యవస్థలు అన్ని బంద్‌లో పాల్గొనేలా అన్ని రాజకీయ పార్టీల మద్దతు కోరుతున్నామని తెలిపారు.

# మారియా కొరీనా మచాడోకు నోబెల్ శాంతి

- **ప్రజాస్వామ్యం కోసం అహర్నిశలు పోరాటం చేసినందుకు గౌరవం**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూసిన నోబెల్ శాంతి బహుమతి–2025 విజేతను రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ శుక్రవారం ప్రకటించింది. ఈ ఏడాది శాంతి బహుమతిని వెనిజులా ప్రజాస్వామ్య హక్కుల కోసం అహర్నిశలు పోరాడిన రాజకీయ నాయకురాలు మారియా కొరీనా మచాడో అందుకోనున్నారు. నియంతృత్వ పాలన నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థ వైపు దేశాన్ని నడిపించేందుకు ఆమె చేసిన నిరంతర పోరాటాన్ని గౌరవిస్తూ ఈ బహుమతి ప్రకటించబడిందని నోబెల్ కమిటీ తెలిపింది.

ఈసారి నోబెల్ శాంతి బహుమతి కోసం అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ప్రబల పోటీదారుడిగా భావించబడ్డారు. అయితే, చివరకు మారియా మచాడోనే విజేతగా ఎంపిక కావడంతో ట్రంప్ ఆశలు తారుమారయ్యాయి. ఈ ఏడాది మొత్తం 338 నామినేషన్లు అందాయి. అందులో 244 వ్యక్తులు, 94 సంస్థలు ఉన్నట్లు కమిటీ వెల్లడించింది. విజేత పేరును నార్వే నోబెల్ కమిటీ అధ్యక్షుడు జోర్గెన్ వాట్నే ఫ్రిడ్నెస్ అధికారికంగా ప్రకటించారు.




**డిసెంబర్ 10న బహుమతి ప్రదానం**

నార్వేలోని ఆస్లో నగరంలో డిసెంబర్ 10న నోబెల్ శాంతి బహుమతి ప్రదానోత్సవం జరగనుంది. నోబెల్ శాంతి బహుమతి విలువ సుమారు 1 కోట్ల 10 లక్షల స్వీడిష్ క్రోనార్ (సుమారు ?8.5 కోట్లు) ఉంటుంది.

ఇజ్రాయెల్–గాజా ఒప్పందం ప్రభావం లేదు

ఇటీవల ఇజ్రాయెల్–గాజా మధ్య శాంతి ఒప్పందం కుదిరినా,ఈ పరిణామం నోబెల్ ఎంపిక ప్రక్రియపై ప్రభావం చూపలేదని నార్వే కమిటీ స్పష్టం చేసింది.

# నేడు కోయంబత్తూరుకు కేటీఆర్

- **ఎఫ్ఎంఎఈ నేషనల్ స్టూడెంట్ మోటార్‌స్పోర్ట్స్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా...**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**




బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) శనివారం కేరళలోని కోయంబత్తూరుకు పర్యటనకు వెళ్లనున్నారు. ఆయన ప్రతిష్ఠాత్మక ఎఫ్ఎంఎఈ నేషనల్ స్టూడెంట్ మోటార్‌స్పోర్ట్స్ 2025 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. దేశవ్యాప్తంగా వివిధ ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొనే ఈ జాతీయ స్థాయి పోటీలు కోయంబత్తూరులోని కుమారగురు ఇన్‌స్టిట్యూషన్స్‌లో నిర్వహించబడుతున్నాయి. ఇది 10వ ఎఫ్ఎంఎఈ నేషనల్ స్టూడెంట్ మోటార్‌స్పోర్ట్స్ కాంపిటీషన్, దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మక విద్యార్థి రేసింగ్ ఈవెంట్‌గా గుర్తింపు పొందింది. ఇంజినీరింగ్ విద్యార్థుల ఆవిష్కరణ దృక్పథం, టెక్నాలజీ నైపుణ్యం, మోటార్‌స్పోర్ట్స్ రంగంలో ప్రతిభ ప్రదర్శనకు ఈ వేదిక దోహదపడనుందని నిర్వాహకులు తెలిపారు. కేటీఆర్ పాల్గొనడం విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపిందని, తాజా సాంకేతికతపై యువత దృష్టి సారించేందుకు ఇది మంచి అవకాశం అవుతుందని భావిస్తున్నారు.

# భద్రాద్రి సీతారామాలయం ఆధ్యాత్మిక ఉట్టిపడేలా అభివృద్ధి

- **రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి సీతారామచంద్ర స్వామి ఆలయం నిర్మాణం ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడేలా ఉండాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆలయ అభివృద్ధి పనులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, పనులు శరవేగంగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, ఆలయ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి



తుమ్మల పలు సూచనలు చేశారు.

ఆలయ విస్తరణకు అవసరమైన భూసేకరణ పూర్తయిందని, ఇప్పుడు మాడ వీధుల విస్తరణ, ప్రాకార గోడల నిర్మాణాలు తక్షణమే ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. ఆగమశాస్త్ర ప్రమాణాలను అనుసరించి ఆర్కిటెక్ట్ రూపొందించిన డిజైన్లను ఫైనల్ చేసి, ఆలయ రూపకల్పనను వేగవంతం చేయాలని సూచించారు. "ప్రతి అంశం ఆగమశాస్త్రం ప్రకారం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. భద్రాద్రి ఆలయాన్ని దేశ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దడం ప్రభుత్వ లక్ష్యం" అని తుమ్మల స్పష్టం చేశారు. భక్తులకు వసతి, రవాణా, పార్కింగ్, నీటి సదుపాయాలు వంటి మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం

మిగితా 4వ పేజీలో

## వాలీబాల్ కోచ్ వేధింపులు.. డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

**బలగం టీవీ, హైదరాబాద్**



తార్నాక రైల్వే డిగ్రీ కళాశాలలో చదువుతున్న ఓ డిగ్రీ విద్యార్థిని కళాశాల వాలీబాల్ కోచ్ వేధింపులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాద ఘటన లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. లాలాగూడలోని సాయిబాబా దేవాలయం సమీపంలో నివాసముంటున్న మౌలిక (19), తార్నాక రైల్వే డిగ్రీ కళాశాలలో సెకండ్ ఇయర్ చదువుతోంది. అదే కళాశాలలో వాలీబాల్ కోచ్‌గా పనిచేస్తున్న అంబాజీ అనే వ్యక్తి కొంతకాలంగా మౌలికను వేధిస్తున్నట్లు తెలుస్తోంది. తనను ప్రేమించాలంటూ ఆ యువతిపై ఒత్తిడి తెస్తున్నాడని సమాచారం. కోచ్ వేధింపుల కారణంగా మౌలిక తీవ్ర మనస్తాపానికి గురైంది. ఈ నేపథ్యంలోనే ఆమె తన నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మౌలిక తండ్రి ప్రమోద్ కుమార్ ఫిర్యాదు మేరకు లాలాగూడ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. నిందితుడు అంబాజీ కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

## పొట్టిగా ఉన్నాడని బావను చంపిన బావమరిది

- **గుంటూరులో పెళ్లైన 10 రోజులకే వరుడి హత్య..**

**బలగం టీవీ, బాపట్ల**



బాపట్ల జిల్లా వేమూరు మండలం ఏడవురు గ్రామానికి చెందిన కుర్రా గణేష్ (25)కి, తెనాలికి చెందిన కీర్తి అంజనీ దేవి అనే యువతితో పెళ్లి సంబంధం కోసం కుటుంబ సభ్యులు వెళ్లారు. అయితే, కుర్రా గణేష్ పొట్టిగా ఉన్నాడనే కారణంతో యువతి తల్లిదండ్రులు ఈ పెళ్లికి నిరాకరించారు. అయినప్పటికీ, మొదటి చూపులోనే ఒకరినొకరు ఇష్టపడిన గణేష్, కీర్తి అంజనీ దేవి ఫోన్ నెంబర్లు మార్చుకుని నిత్యం మాట్లాడుకుంటూ మరింత దగ్గరయ్యారు. పెద్దలు ఒప్పుకోకపోవడంతో, సుమారు 10 రోజుల క్రితం ఈ జంట అమరావతి గుడిలో పారిపోయి పెళ్లి చేసుకున్నారు. పెళ్లి విషయం తెలుసుకున్న యువతి సోదరుడు దుర్గారావు, గణేష్‌ను హెచ్చరించాడు. "పొట్టిగా ఉన్నాడని తెలిసినా, తన చెల్లికి మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకున్నావు, నీ అంతు చూస్తాను" అని వార్నింగ్ ఇచ్చాడు. దీంతో తనకు యువతి కుటుంబ సభ్యుల నుండి ప్రాణహాని ఉందని భావించిన గణేష్, నల్లపాడు పోలీసులను ఆశ్రయించాడు.

పెళ్లి గుడిలో చేసుకున్నా, రిసెప్షన్ గ్రాండ్‌గా చేసుకోవాలని నిర్ణయించుకున్న గణేష్, ఇందుకోసం బ్యాంకులో బంగారం తాకట్టు పెట్టి డబ్బులు తీసుకుని వస్తున్నాడు. ఈ క్రమంలోనే, పథకం ప్రకారం మాటు వేసిన బావమరిది దుర్గారావు, అతని స్నేహితులతో కలిసి నడిరోడ్డుపైనే కత్తితో గణేష్‌ను విచక్షణారహితంగా పొడిచి చంపాడు. తీవ్ర గాయాలపాలైన గణేష్ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దుర్గారావుతో పాటు అతని స్నేహితులను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో దుర్గారావు బావ పొట్టిగా ఉన్నాడని, మాయమాటలు చెప్పి తన చెల్లిని పెళ్లి చేసుకున్నాడనే కోపంతోనే ఈ హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేస్తున్నారు.



## రామ్ కోటితో పాటు 350 మందికి పైగా జాగృతిలోకి ఆహ్వానం..

- **కల్వకుంట్ల కవిత**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఎల్బీ నగర్ నియోజకవర్గంలోని మన్సూరాబాద్‌కు చెందిన ప్రముఖ బీసీ నాయకులు రామ్ కోటి శుక్రవారం తెలంగాణ జాగృతిలో చేరారు. బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రామ్ కోటితో పాటు 350 మందికి పైగా కార్యకర్తలను సాదరంగా జాగృతిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, జాగృతిలో చేరడం అంటే బతుకమ్మ ఆడినంత ఆనందంగా ఉంటుందని, అదే సమయంలో పిడికిలెత్తి పోరాటం చేయాల్సిన అవసరం కూడా ఉందని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ఈ వైఫల్యాలపై జాగృతి ఆధ్వర్యంలో ఉధృతంగా పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ ప్రభుత్వం ఆడబిడ్డలకు రూ. 2500 నెలకు ఇస్తామంటూ మోసం చేసినందుకు మనం కొట్లాడాలని, ప్రసవం కోసం ఆస్పత్రులకు వెళ్లే మహిళలకు గతంలో వచ్చే కేసీఆర్ కిట్లు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిలిపివేసింది. ఆడబిడ్డలకు కిట్ల సాధన కోసం ప్రభుత్వంపై పోరాడాలని, పేదింటి బిడ్డ పెళ్లికి ఇస్తానన్న తులం బంగారం హామీని అమలు చేయలేదు, దాని కోసం కొట్లాడాలని అన్నారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు అంటూ అధికారంలోకి వచ్చి కనీసం ఒక్క ఉద్యోగం కూడా ఇయ్యలేని పరిస్థితిపై పోరాడాలని, ముఖ్యంగా బీసీ బిల్లు తెస్తామని తేనందుకు మనం కొట్లాడాలని, జాగృతి అంటేనే పోరాటాల జెండా, విప్లవాల జెండా అని కవిత అన్నారు. ఒక్కటి కాదు రెండు కాదు అన్ని అంశాలపైన ఈ ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని ఆమె స్పష్టం చేశారు.

## గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల సదస్సులో కేటీఆర్..

- **నోవాటెల్‌లో జరిగిన ఐసీఏఐ జీసీసీ సదస్సులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**బలగం టీవీ, హైదరాబాద్**



గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల రాజధానిగా హైదరాబాద్ నగరం రూపాంతరం చెందిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని నోవాటెల్‌లో జరిగిన ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా జీసీసీ సమ్మిట్లో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుతం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లలో రెండవ స్థానంలో ఉన్న హైదరాబాద్ నగరం త్వరలోనే మొదటి స్థానానికి చేరుకుంటుందని, బెంగళూరును దాటి మరింత ప్రగతి సాధించాలని ఆశిస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు రాజధానిగా మారడం వెనుక గత పది సంవత్సరాల ప్రభుత్వ కృషి ఎంతగానో ఉందన్నారు. పది సంవత్సరాలపాటు అన్ని రంగాల్లో, అన్ని కోణాల్లో నగరాన్ని సమగ్రంగా తీర్చిదిద్దడం వల్లే ఈ పురోగతి సాధ్యమైందని వివరించారు.

అధికారంలో ఉన్నప్పుడు వ్యక్తుల ఆధారంగా కాకుండా, శాశ్వతంగా మంచి ఫలితాలు వచ్చేలా వ్యవస్థలను, చట్టాలను, సంస్కరణలను తీసుకురావడం వలననే తెలంగాణ వ్యాపార, వాణిజ్య, పెట్టుబడి రంగాల్లో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. అందుకే బ్యాంకింగ్, ఫార్మా, హెల్త్ కేర్, ఐటీ వంటి అన్ని రంగాల్లో భారీగా పెట్టుబడులను, అంతర్జాతీయ కంపెనీలను ఆకర్షించగలిగిందని కేటీఆర్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో అనేక పెట్టుబడి అవకాశాలు ఉన్నాయని, వాటన్నింటినీ ఉపయోగించుకొని మరింత పెట్టుబడులు వచ్చేలా తమ పరిధిలో కృషి చేయాలని ఆయన చార్టెడ్ అకౌంటెంట్‌లకు పిలుపునిచ్చారు. ప్రస్తుత సంస్కరణల యుగంలో ఆర్థిక కార్యకలాపాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువస్తున్న చట్టాల నేపథ్యంలో చార్టెడ్ అకౌంటెంట్ల ప్రాధాన్యత బాగా పెరిగిందని, వీరంతా దేశంలో డిజిటల్ ఫైనాన్షియల్ ఎకోసిస్టమ్‌కు సంబంధించిన రంగంలో కీలకంగా మారారని కేటీఆర్ తెలిపారు. చివరగా, ప్రభుత్వంలో ఉన్నా లేకపోయినా తెలంగాణ రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు రావాలని తాము ఎల్లప్పుడూ కోరుకుంటామని కేటీఆర్ తెలిపారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. సమ్మిట్‌కి తనను ఆహ్వానించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## కోర్టు తీర్పు పై కళ్లకు గంతలతో వినూత్న నిరసన..

- **బీసీ రిజర్వేషన్ల సాధన కొరకు తెలంగాణ తరహా ఉద్యమం..**
- **బీసీ రిజర్వేషన్లను అడ్డగిస్తే సహించేది లేదు..**
- **బీఆర్ఎస్, బిజెపి పార్టీల వైఖరి అనుమానస్పదం..**
- **ప్రభుత్వ వైఖరిని బట్టి తదుపరి కార్యాచరణ.. ఏది ఏమైనా 42 శాతం రిజర్వేషన్ సాధించి తీరుతాం..**
- **బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హన్మాండ్లు**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కొరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలంగాణ ఉద్యమ తరహా ఉద్యమాన్ని నిర్మిస్తామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హన్మాండ్లు అన్నారు. తేదీ 10-10-2025 శుక్రవారం రోజున అంబేద్కర్ చౌరస్తా వద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిన్నటి రోజు జీవో నెంబర్ 9 పై హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వు ల పై కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పర్ష హన్మాండ్లు మాట్లాడుతూ.. బీసీల 42 శాతం రిజర్వేషన్లపై న్యాయపరమైన రాజకీయపరమైన పోరాటం చేస్తామని ఆరు నూరైనా ఏది ఏమైనా 42% రిజర్వేషన్లు సాధించి తీరుతామని పర్ష హన్మాండ్లు అన్నారు. బీసీ రిజర్వేషన్లను కొందరు వ్యక్తులు అడ్డగించే ప్రయత్నం చేస్తున్నారని నోటికాడి బుక్కను ఎత్తగొడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని పర్ష హన్మాండ్లు హెచ్చరించారు. జనాభా దామాషా ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం బీసీ కులగన చేసి డెడికేషన్ కమిషన్ వేసి చట్టసభలలో బిల్లులు ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదింపజేసి గవర్నర్, రాష్ట్రపతికి అట్టి బిల్లులను పంపించారని ఆరు నెలలుగా ఆ బిల్లులను ఆమోదించక పెండింగ్లో పెట్టడం శోచనీయమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టాలనే డిమాండ్ మేరకు తెలంగాణ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు విద్యా ఉద్యోగ రాజకీయ రంగంలో కల్పిస్తూ జీవో నెంబర్ 9 ని తీసుకొచ్చిందని పర్ష హన్మాండ్లు అన్నారు.

జీవో నెంబర్ 9 ప్రకారం ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూలు నోటిఫికేషన్ ఇచ్చిందని ఆ జీవో నెంబర్ 9 ప్రకారం స్థానిక ఎన్నికలలో బీసీలకు 42 శాతం కల్పిస్తూ జిఓ ఇచ్చిందని దీనివలన స్థానిక సంస్థల ఎన్నికలలో రాజ్యాధికారం బీసీలకు సాధ్యమైందన్నారు. ఇంత మంచి పనికి కృషి చేసిన ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఒకరిద్దరూ బీసీలకు వ్యతిరేకంగా జీవో నెంబర్ 9 కు వ్యతిరేకంగా కోర్టుకు వెళ్లడం కుట్రపూరితమన్నారు, అగ్రవర్ణాలకు ఈ డబ్ల్యూ ఎస్ 10% రిజర్వేషన్లు కల్పించినప్పుడు బీసీలు ఎక్కడ అడ్డగించలేదని కోర్టుకు కూడా వెళ్లలేదని పర్ష హన్మాండ్లు గుర్తు చేశారు.

జనాభా ప్రకారం అగ్రవర్ణాలకు 10% రిజర్వేషన్ ఇచ్చినప్పుడు బీసీల జనాభా 56% ఉంటే 42 శాతం రిజర్వేషన్లు ఇస్తే కూడా దాన్ని అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం అని ఈ కడుపుమంట ఎందుకని అన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయమై అసెంబ్లీలో బిజెపి బీఆర్ఎస్ పార్టీలు బిల్లులకు మద్దతు ఇచ్చాయని బయట మాత్రము ఈ రెండు పార్టీలు బీసీలకు అనుమానం వచ్చే విధంగా ప్రవర్తిస్తున్నాయని అన్నారు. నిన్నటి రోజున జీవో నెంబర్ 9 పైన హైకోర్టు ఇచ్చిన స్టే పైన రాష్ట్ర ప్రభుత్వం సీరియస్గా తీసుకొని దాన్ని ఎత్తివేయించాలని అదేవిధంగా టిఆర్ఎస్ బిజెపి పార్టీలు కోర్టులో 42 శాతం రిజర్వేషన్ల కు మద్దతుగా ఇంప్లీడ్ కావాలని పర్ష హన్మాండ్లు పిలుపునిచ్చారు. ప్రభుత్వ మరియు ప్రతిపక్షాల వైఖరుల మీద రెండు రోజులు వేచి చూసి తదుపరి కార్యాచరణ చేపడతామని రేపటి రోజున హైదరాబాదులో అన్ని బీసీ సంఘాలు అన్ని కుల సంఘాలు సమావేశమై భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలియజేశారు. 42 శాతం రిజర్వేషన్లు సాధించేవరకు నిరవధిక తెలంగాణ బంద్ కూడా వెనుకాడ బోమని పర్ష హన్మాండ్లు అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు తడక కమలాకర్, జిల్లా అధికార ప్రతినిధి బండారు బాల్ రెడ్డి, మున్నూరు కాపు సంఘం జిల్లా నాయకుడు నంది కిషన్, పద్మశాలి సంఘం జిల్లా నాయకుడు గోలి వెంకటరమణ, యాదవ సంఘం జిల్లా నాయకుడు తోట్ల రాములు, యాదవ్, ముదిరాజ్ సంఘం సిరిసిల్ల అధ్యక్షుడు వంకాయల కార్తీక్, బీసీ సంఘం నాయకులు బోయినీ శ్రీనివాస్, తోట్ల మల్లేష్ యాదవ్ , భూదం ఆంజనేయులు, బిసి యువజన సంఘం జిల్లా నాయకుడు చెన్నమనేని రాజకుమార్, నాయకులు సామల తిరుపతి ఇల్లంతకుంట తిరుపతి, సామల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీకి చిక్కిన విద్యుత్ ఏఈ

**బలగం టీవీ, హైదరాబాద్**

సింగిల్ ఫేజ్ విద్యుత్ మీటర్‌ను త్రీ ఫేజ్ మీటర్‌గా మార్చేందుకు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసేందుకు ఓ వినియోగదారుడి (కన్స్యూమర్) నుంచి లంచం డిమాండ్ చేసిన విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) భూమిరెడ్డి సుధాకర్ రెడ్డిని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన హైదరాబాద్‌లోని లాలాగూడ పరిధిలో చోటు చేసుకుంది. తన విద్యుత్ కాంట్రాక్టుకు సంబంధించిన స్థలంలో ఈ పనుల కోసం ఏఈ సుధాకర్ రెడ్డి లంచం డిమాండ్ చేయడంతో, బాధితుడు నేరుగా ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు, ఏఈ రూ. 15,000 లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఏసీబీ అధికారులు అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.



# రైతులకు మద్దతు ధర అందించడమే లక్ష్యం..

- **ధాన్యం సేకరణలో ఇబ్బందులు లేకుండా చూడాలి..**
- **కలెక్టర్ ఎం. హరిత**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**



రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి మద్దతు ధర అందించడమే లక్ష్యమని కలెక్టర్ ఎం. హరిత అన్నారు . గురువారం ఖరీఫ్ సీజన్ 2025–26 ధాన్యం సేకరణపై పౌర సరఫరాల శాఖ, రెవెన్యూ, వ్యవసాయ శాఖ, రవాణా, మార్కెటింగ్, సహకార, ఐకేపీ, మెప్మా ఇతర శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదా యంలోని ఆడిటోరియంలో కలెక్టర్ ఎం. హరిత సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ఎం. హరిత మాట్లాడుతూ గత ఖరీఫ్ సీజన్లో జిల్లాలో 2,11,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, ఈ సీజన్లో దాదాపు 2,70,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారనిఅన్నారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా గ్రామాల్లో వరి కోతలు మొదలు అయితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వెంటనే ఆయా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. అలాగే రైతులకు ధాన్యం కేంద్రాలకు ఎలా తరలించాలి? తేమ శాతం వివరాలు తెలిపి టోకెన్లు ఇవ్వాలని ఆదేశించారు. సన్న ధాన్యాన్ని నిర్ధారించి, దాని వివరాలు కొనుగోలు కేంద్రాల బాధ్యులకు ఇవ్వాలని సూచించారు. ఐకేపీ, మెప్మా, పీఏసీఎస్, డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ధాన్యం సేకరణ, రైతుల వివరాల నమోదు ఇతర అంశాలపై శిక్షణ ఇచ్చామని అన్నారు.

పౌర సరఫరాల శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణలో ఇబ్బందులు తొలగించాలని సూచించారు. ధాన్యం సేకరణ, రవాణా, లారీలు ఇతర ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని అన్నారు. రైతులు తమ ధాన్యాన్ని తాలు, తప్ప లేకుండా, తేమ శాతం 17 ఉండేలా చూసుకుని కేంద్రాలకు తరలించాలని సూచించారు. ప్రభుత్వం గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.23 89, కామన్ రకానికి రూ.2369 నిర్ణయించిదని వెల్లడించారు. సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ. 500 అదనంగా ఇస్తుందనిఅన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 13 మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ధాన్యాన్ని సేకరించేందుకు ఐకేపీ ఆధ్వర్యంలో 144, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 79, మెప్మా, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో కలిపి మొత్తం 231 ప్రారంభించనున్నట్లు తెలిపారు.

**అందుబాటులో పరికరాలు**

జిల్లాలో అవసరం మేరకు అన్ని పరికరాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. టార్పాలిన్లు 7592, తూకం వేసే యంత్రాలు 764, ప్యాడీ క్లీనర్లు 731, తేమ శాతం చూసే మెషిన్లు 603, గ్రెన్ కాలిపర్స్ 270 ఇతర యంత్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్ డీసీఎస్ఓ చంద్రప్రకాష్, జిల్లా మేనేజర్ రజిత డీఏఓ అఫ్జల్ బేగం, డీఆర్డీఓ శేషాద్రి, డీసీఓ రామకృష్ణ, డీఎంఓ ప్రకాష్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

# ‘క్రెడిట్ కార్డ్ యాక్టివేషన్’ మోసాలు...

- **అంతర్ రాష్ట్ర సైబర్ నేరగాడు అరెస్ట్..**
- **క్రెడిట్ కార్డ్ యాక్టివేషన్ పేరుతో వాట్సప్ కి ఏపీకే లింక్ షేర్ చేస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర సైబర్ నిందుతుడు అరెస్ట్..**
- **దేశవ్యాప్తంగా ఎన్‌సీఆర్‌పీ పోర్టల్ నందు 327 ఫిర్యాదులు , 02 మొబైల్ ఫోన్స్ స్వాధీనం..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



క్రెడిట్ కార్డ్ యాక్టివేషన్ పేరుతో వాట్సప్ ద్వారా ఏపీకే లింక్‌లు పంపి సైబర్ నేరాలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర సైబర్ నిందితుడిని సిరిసిల్ల పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో దేశవ్యాప్తంగా ఎన్‌సీఆర్‌పీ (National Cybercrime Reporting Portal) పోర్టల్‌లో 327 ఫిర్యాదులు నమోదయ్యాయి. నిందితుడి నుంచి రెండు మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

ఈ వివరాలను డి.ఎస్.పి. సిరిసిల్ల, కె.చంద్రశేఖర రెడ్డి వెల్లడించారు. సైబర్ నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సైబర్ టీమ్, సిరిసిల్ల పట్టణ పోలీసులను డి.ఎస్.పి. ప్రత్యేకంగా అభినందించారు. అరెస్ట్ చేయబడిన మరియు జైలులో ఉన్న నిందితులు ఏ1 అంకిత్ కుమార్ ఏ అంకిత్ జార్ఖండ్ రాష్ట్రం, ఏ2 మొహమ్మద్ కలీం పాషా హైదరాబాద్. ప్రస్తుతం పరారీలో ఉన్న నిందితుడు ఏ3 రషీద్ హైదరాబాద్.

హైదరాబాద్‌కు చెందిన మొహమ్మద్ కలీం పాషా , అతని స్నేహితుడు రషీద్ ఇద్దరూ తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఆన్‌లైన్ మోసాలకు పాల్పడాలని నిర్ణయించుకున్నారు.2025 ఫిబ్రవరి నెలలో, కలీం పాషా మరియు రషీద్ కలిసి కలకత్తాకు వెళ్లి, రషీద్‌కు పరిచయం ఉన్న అంకిత్ అనే వ్యక్తిని కలిశారు. ఆర్‌బీఎల్ క్రెడిట్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుని, కార్డ్ యాక్టివేషన్ కోసం ఎదురుచూసే వారి యొక్క పేర్లు, ఫోన్ నంబర్లు, క్రెడిట్ కార్డు నంబర్లు, మరియు పాన్ కార్డ్ నంబర్లను అంకిత్ వారికి వాట్సప్ ద్వారా పంపేవాడు. కలీం పాషా మరియు రషీద్, క్రెడిట్ కార్డ్ కస్టమర్ కేర్ ప్రతినిధులుగా నటిస్తూ, బాధితులతో మాట్లాడి వారిని నమ్మించేవారు.క్రెడిట్ కార్డ్ యాక్టివేషన్ పేరుతో అంకిత్ పంపిన ఏపీకే/లింక్‌లను బాధితులకు పంపేవారు. బాధితులు ఆ లింక్‌ను క్లిక్ చేసినా లేదా ఏపీకేను ఇన్‌స్టాల్ చేసుకున్నా, వారి ఫోన్ హ్యాక్ అయ్యేది. ఫోన్ హ్యాక్ అయిన వెంటనే, అంకిత్ ఆ క్రెడిట్ కార్డులలోని డబ్బులను ఇ–కామర్స్ ద్వారా కొనుగోళ్లు జరిపి కాజేసేవాడు.

ప్రతి లక్ష రూపాయల మోసానికి, అంకిత్ నుంచి మొహమ్మద్ కలీం మరియు రషీద్‌లకు రూ. 2,500/– చొప్పున ర్యాపిడో కొరియర్ ద్వారా గుర్తు తెలియని వ్యక్తుల ద్వారా డబ్బులు అందేవి. అంకిత్ వీరికి కేవలం వాట్సప్ ద్వారానే పరిచయం ఉండి, ప్రతి 10 రోజులకు ఒకసారి కొత్త మొబైల్ ఫోన్లు మరియు సిమ్ కార్డులను ర్యాపిడో కొరియర్ ద్వారా పంపించి, పాత వాటిని తిరిగి వెనక్కి తీసుకునేవాడు. సిరిసిల్ల పట్టణానికి చెందిన సురేష్ కుమార్ అనే వ్యక్తి ఈ ముఠా చేతిలో మోసపోవడంతో, సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సిరిసిల్ల పట్టణ పోలీసులు, జిల్లా సైబర్ టీమ్ అయిన ఆర్.ఎస్.ఐ జునైద్, గంగారెడ్డి, కిట్టు, మహేష్ ఆధ్వర్యంలో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి, సాంకేతికత ఆధారంగా దర్యాప్తు చేసి, ప్రధాన నిందితుడు అంకిత్‌ను జార?ండ్ రాష్ట్రంలో పట్టుకున్నారు. పరారీలో ఉన్న మరో నిందితుడు రషీద్‌ను త్వరలో పట్టుకుంటామని అధికారులు తెలిపారు. సైబర్ ఆర్.ఎస్.ఐ. జునైద్, సైబర్ టీమ్ సభ్యులు గంగారెడ్డి, కిట్టు, మహేష్, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్‌లను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## రాజన్న సిరిసిల్ల నేతన్న అద్భుతం.. 362 గ్రాముల వెండితో పట్టు చీర..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన నేత కార్మికుడు వెల్ది హరిప్రసాద్ చేనేత కళలో తన అద్భుతమైన నైపుణ్యాన్ని మరోసారి చాటుకున్నారు. దాదాపు శతాబ్ది కాలం నాటి పట్టుపితాంబరం చీరను తిరిగి పునర్ సృష్టించి, ఆ కళకు కొత్త జీవం పోశారు. మెదక్ జిల్లా రామాయంపేటకు చెందిన స్వప్న ఆర్డర్ మేరకు హరిప్రసాద్ ఈ అపురూపమైన పనిని చేపట్టారు. ఈ చీరను నేయడానికి ఆయనకు ఏకంగా 60 రోజుల పాటు శ్రమించాల్సి వచ్చింది. పూర్తి చేతితో రూపొందించిన ఈ చీర బరువు 660 గ్రాములు కాగా, ఇందులో ఏకంగా 362 గ్రాముల వెండిని వినియోగించడం విశేషం. సాధారణంగా చీరల్లో రెండు పక్కల అంచులు (బార్డర్లు) రన్నింగ్‌లో, అంటే వరుసగా నేయబడతాయి. అయితే, ఈ ప్రత్యేకమైన పట్టుపితాంబరం చీరలో బార్డర్, బుటా (చిన్న డిజైన్లు) మరియు మీనా వర్క్ అన్నీ కూడా ఒక్కొక్కటిగా చేతితో పెట్టి వేయడం ఈ చీర యొక్క ముఖ్యమైన ప్రత్యేకత. గురువారం రోజున ఈ అద్భుతమైన చీరను వారికి అందించడం జరిగింది.

## నాణ్యమైన రేషన్ బియ్యం అందడం లేదని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చర్యలు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా, ఇల్లంతకుంట మండలం, పెద్దలింగాపూర్ గ్రామ ప్రజలకు రేషన్ షాపు ద్వారా నాణ్యమైన సన్న బియ్యం అందడం లేదన్న ఫిర్యాదుపై తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ స్పందించింది. కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్ ఈ అంశంపై కేసు నమోదు చేసి, వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు. పెద్దలింగాపూర్ గ్రామ హక్కుదారులు చేసిన ఫిర్యాదును స్వీకరించిన అనంతరం, మెంబర్ ఓరుగంటి ఆనంద్ రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. ఈ అంశంపై డీజీఆర్ఓ (డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ ఆఫీసర్స్) ద్వారా తక్షణమే విచారణ జరిపించాలని ఆదేశించారు. ముఖ్యంగా, రేషన్ షాపులో ఉన్న పాడైపోయిన బియ్యాన్ని వెంటనే వాపస్ తీసుకొని, వాటి స్థానంలో నాణ్యమైన సన్న బియ్యాన్ని సరఫరా చేయాలని ఆదేశాలలో పేర్కొన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజా హక్కును కాపాడటానికి సివిల్ సప్లయర్స్ గోదాము నుండి నేరుగా ప్రజలకు నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ అయ్యేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ చర్యల అమలుపై తీసుకున్న వివరాలతో కూడిన నివేదికను 10 రోజుల లోగా రాష్ట్ర ఫుడ్ కమిషన్ కార్యాలయానికి పంపించాలని జిల్లా కలెక్టర్‌ను మెంబర్ ఓరుగంటి ఆనంద్ ఆదేశించారు.

# ఏసీబీకి చిక్కిన పంచాయతీ సెక్రటరీ..

- **ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేందుకు లంచం డిమాండ్ చేసిన పంచాయతీ సెక్రటరీ**
- **రూ.10,000 లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు**

**బలగం టీవీ, కరీంనగర్**



కరీంనగర్ జిల్లాలో లంచం తీసుకుంటూ ఓ పంచాయతీ కార్యదర్శి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు కోసం ఓ లబ్ధిదారుడి నుంచి లంచం డిమాండ్ చేసిన పంచాయతీ కార్యదర్శి ఎం.అనిల్. వివరాల్లోకి వెళితే, జిల్లాలోని గంగాధర మండలం, మధురానగర్ గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి ఎం.అనిల్, లబ్ధిదారుడికి సంబంధించిన ఇందిరమ్మ ఇల్లు ఫైలును ప్రాసెస్ చేసేందుకు రూ.10,000 లంచం డిమాండ్ చేశాడు. బాధితుడు ఈ విషయాన్ని ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పక్కా వ్యూహంతో వల పన్నారు. లబ్ధిదారుడి నుంచి రూ.10,000 లంచం తీసుకుం టుండగా, పంచాయతీ కార్యదర్శి ఎం.అనిల్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

# స్నేహితుడి దారుణ హత్య

- **యూట్యూబ్ చూసి మృతదేహం ముక్కలు..**
- **3 తులాల బంగారం కోసం...**

**బలగం టీవీ, ఖమ్మం**



ఖమ్మం జిల్లాలో సంచలనం సృష్టించిన హత్య కేసు మిస్సింగ్ కేసుతో మొదలై, దిగ్భ్రాంతికరమైన విషయాలను వెల్లడించింది. స్వలింగ సంపర్కులైన స్నేహితుడిని 3 తులాల బంగారం, డబ్బుల కోసం అత్యంత కిరాతకంగా చంపి, మృతదేహాన్ని ముక్కలు చేసి పారేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిందితుల్లో ఒకరు ఏకంగా యూట్యూబ్‌లో వీడియోలు చూసి హత్య, మృతదేహాన్ని ముక్కలు చేసే పద్ధతులను నేర్చుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఖమ్మం జిల్లాకు చెందిన వెంకటేశ్వర్లు, అశోక్ ఇద్దరూ స్వలింగ సంపర్కులు. తరచూ వెంకటేశ్వర్లు అశోక్ వద్దకు వచ్చి లైంగిక కార్యకలాపాలు నిర్వహించి, డబ్బులు ఇచ్చి వెళ్లడం అలవా టుగా మారింది. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు వద్ద చాలా డబ్బు, బంగారం ఉందని గ్రహించిన అశోక్, తన స్నేహితుడు పెంటి కృష్ణయ్యతో కలిసి అతడిని చంపి, ఆస్తిని దోచుకోవాలని పథకం వేశాడు. గత నెల 16న (సెప్టెంబర్ 16) వెంకటేశ్వర్లు యధావిధిగా అశోక్ ఇంటికి వచ్చాడు. వెంకటేశ్వర్లు నిద్రలో ఉన్న సమయంలో, పథకం ప్రకారం అశోక్, కృష్ణయ్య అత్యంత దారుణంగా అతడి తల నరికి చంపారు. ఈ హత్యను శబ్దం చేయకుండా ఎలా చేయాలి, మృతదేహాన్ని ముక్కలు చేసి ఎలా పారేయాలనే పద్ధతులను అశోక్ యూట్యూబ్‌లో వీడియోలు చూసి నేర్చుకున్నట్లు విచారణలో వెల్లడైంది. హత్య అనంతరం, మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా చేసి, వాటిని ప్లాస్టిక్ కవర్లలో పెట్టి వివిధ ప్రాంతాల్లో పారేశారు. నిందితులు ఇద్దరికీ నగ్మా అనే మహిళ కూడా సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. హత్య తర్వాత, నిందితులు వెంకటేశ్వర్లు మెడలో ఉన్న 3 తులాల బంగారాన్ని తీసుకున్నారు. అంతేకాక, వెంకటేశ్వర్లు మొబైల్‌లోని ఫోన్ పే అకౌంట్ నుండి తరచూ తమ ఖాతాలకు డబ్బులు బదిలీ చేసుకున్నారు. వెంకటేశ్వర్లు కనిపించడం లేదని మిస్సింగ్ కేసు నమోదు కాగా, పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో ముక్కలైన తల, చేతులు వంటి శరీర భాగాలు లభించడంతో కేసు హత్యగా మారింది. వెంకటేశ్వర్లు ఫోన్ పే నుండి డబ్బులు బదిలీ అవుతున్న విషయాన్ని పోలీసులు పసిగట్టి, ఆ ఆధారంగా అశోక్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో అశోక్, కృష్ణయ్య, నగ్మా కలిసి చేసిన ఈ సంచలన హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు బయటపడ్డాయి. మృతదేహంలోని కొన్ని ముఖ్య శరీర భాగాలను నదిలో వేయడంతో, మొండెం ఇంకా లభ్యం కాలేదని పోలీసులు తెలిపారు.

## ఉప్పుపల్లి అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం వేడుకలు

**బలగం టీవీ, పెగడపల్లి**

పెగడపల్లి మండలం లింగాపూర్ అనుబంధ గ్రామమైన ఉప్పుపల్లి అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ మాసం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మండల ఐసీడీఎస్ సూపర్వైజర్ మహేశ్వరి మాట్లాడుతూ, “మూడు నుండి ఐదు సంవత్సరాల లోపు చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందించడం జరుగుతోంది. తల్లి, శిశు ఆరోగ్యం కోసం సమతుల ఆహారం అత్యంత ముఖ్యం” అని తెలిపారు. ఈ సందర్భంగా గర్భిణీలకు సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాశన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో అంగన్వాడీ టీచర్ సుహాసిని, ఆశా వర్కర్లు, తల్లులు పాల్గొన్నారు.

